

'తోటపల్లి'ని వదిలేశారు..

ఎచ్చెర్ల నియోజకవర్గం పూర్తిగా మెట్ట ప్రాంతం. కనీస స్థాయిలో కూడా సాగునీటి వనరులు లేవు. ఈ పరిస్థితుల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కళా వెంకటరావు చొరవతో తోటపల్లి కాలువను జి.సిగడాం, లావేరు మీదుగా రణస్థలం మండలానికి విస్తరించారు. దీంతో కొంతవరకూ సాగునీటి అవసరాలు తీరాయి. కానీ గత వైసీపీ పాలనలో తోటపల్లి కాలువపై నిర్లక్ష్యం కొనసాగింది. ఐదేళ్లు కనీసస్థాయిలో నిర్వహణ లేదు. శివారు ఆయకట్టుగా ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గానికి నీరు వచ్చిందా? లేదా? అని పట్టించుకునే వారు కరువయ్యారు. కాలువలో నీరు పారక.. చాలాచోట్ల పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి.



రణస్థలం మండలంలో తోటపల్లి కాలువ దుస్థితి ఇది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ కాలువను నిర్మించారు. వర్షాధార ప్రాంతమైన ఎచ్చెర్ల నియోజకవర్గానికి సాగునీరు అందించాలన్న లక్ష్యంతో అప్పటి మంత్రి కళా వెంకటరావు చొరవతో ఈ కాలువ పనులు చేపట్టారు. అప్పట్లో శివారు ఆయకట్టుకు సాగునీరు అందేది. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అంతులేని నిర్లక్ష్యం కారణంగా సాగునీటి కోసం రైతులు ఎదురుచూడాల్సిన దుస్థితి దాపురించింది. ఈ కాలువకు ఏటా ఖరీఫ్, రబీలో సాగునీరు అందే క్రమంలో భూగర్భ జలాలు పుష్కలంగా లభించేవి. కానీ ప్రస్తుతం కాలువలో నీరు లేకపోవడంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

డేంజర్.. డేంజర్!

- జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- 76 గ్రామాల్లో ప్రమాద ఘంటికలు
- ఎచ్చెర్ల నియోజకవర్గంలోనే 71 గ్రామాల్లో తీవ్రం
- తోటపల్లి కాలువ నిర్వహణ అస్తవ్యస్తం
- గత ఐదేళ్లలో కొనసాగిన నిర్లక్ష్యం


కొండములగాం ప్రాంతంలో అడుగంటిన బావి

రణస్థలం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. అవసరానికి మించి నీటి వినియోగం కారణంగా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇటీవల కేంద్ర భూగర్భ జలవనరులశాఖ కీలక అధ్యయనం చేసింది. రాష్ట్రంలో 2,617 గ్రామాల్లో భూగర్భజలాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించింది. అందులో 300 గ్రామాల్లో ప్రమాదభరితంగా నీటిని తోడేస్తున్నారని తేలింది. జిల్లాకు సంబంధించి 76 గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటాయని వెల్లడించింది. ఎచ్చెర్ల నియోజకవర్గంలోనే అత్యధికంగా 71 గ్రామాల్లో తీవ్ర నీటిఎద్దడి నెలకొన్నట్టు పేర్కొంది.ఏటా వర్షాకాలంలో భూగర్భ జలాలు ఉబికి రావడం, వేసవిలో అడుగంటడం సర్వసాధారణం. కానీ ఎచ్చెర్ల నియోజకవర్గంలో పారిశ్రామిక, వ్యవసాయ, ఇళ్ల అవసరాలకు అధికంగా నీరు తోడేస్తుండడంతో భవిష్యత్‌లో మరికొన్ని గ్రామాలకు విపత్కర పరిస్థితులు తప్పవని హెచ్చరించింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చాలాచోట్ల బావులు అడుగంటిపోయాయని, చెరువులు ఎండిపోయాయని వాపోతున్నారు. భవిష్యత్‌లో తమకు మరింత నీటికష్టాలు తప్పేలా లేవని దిగులు చెందుతున్నారు.

పారిశ్రామిక అవసరాలతో..

ఎచ్చెర్ల నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం. పైడిభీమవరం పారిశ్రామికవాడతో పాటు ఎచ్చెర్ల మండలంలో ఎన్ఏసీఎల్, శ్యామ్‌ఫిన్టన్ వంటి పలు పరిశ్రమలు ఉన్నాయి. వీటితో స్థానికంగా ఉపాధి దొరికేది తక్కువే. కానీ ఈ పరిశ్రమలు దాదాపు నాలుగు మండలాల్లో భూగర్భ జలాలను భారీగా తోడేస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా పారిశ్రామిక అవసరాలకు 2.63కోట్ల లీటర్ల నీటిని వినియోగిస్తున్నాయి. ఒక్క పైడిభీమవరం పారిశ్రామికవాడలోనే 2కోట్ల లీటర్ల నీటిని వినియోగిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా కందివలస గెడ్డ నుంచి ఎక్కువగా నీటిని తోడేస్తున్నారు. సాధారణంగా 100 యూనిట్ల వరకూ నీరు ఊరితే.. 70 యూనిట్ల వరకూ తోడడం సేఫ్. కానీ అంతకు మించి నీటిని తోడేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో 110 యూనిట్ల వరకూ (మిగతా 6వ పేజీలో..)

నేటి నుంచి పదో తరగతి మూల్యాంకనం

- విధులకు 1,229 మంది సిబ్బంది నియామకం

గుజరాతీపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో పదో తరగతి మూల్యాంకనం(స్పాట్ వాల్యూయేషన్) గురువారం నుంచి ప్రారంభం కానుంది. శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, మహాలక్ష్మినగర్‌కాలనీలోని చైతన్య స్కూల్ ఆవరణలో ఈ ప్రక్రియ నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అన్ని మండలాల నుంచి 1,81,367 జవాబు పేపర్లు జిల్లాకు చేరాయి. స్పాట్ సజావుగా జరిగేందుకు క్యాంపు ఆఫీసర్లుగా శ్రీకాకుళం, టెక్కలి డిప్యూటీ డీఈవోలు ఆర్.విజయకుమారి, పి.విలియమ్స్‌ను నియమించారు. విధులకు వేర్వేరు సబ్జెక్టులకు సంబంధించి 1,229మంది ఉపాధ్యాయులు, సిబ్బందిని వినియోగిస్తున్నట్లు డీఈవో తిరుమల చైతన్య తెలిపారు. పర్యవేక్షకులుగా ఏడుగురు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్, అసిస్టెంట్లు 934 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 268 మంది, 20మంది క్యాంప్ స్టాఫ్‌ను వినియోగించేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. ఇదిలా ఉండగా ఉపాధ్యాయుల సమస్యల కోసం ఉమ్మడి ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు స్పాట్‌ను బహిష్కరిస్తామని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారుల చర్చలు బుధవారం రాత్రి వరకు కొనసాగాయి. చర్చలు సఫలమవడంతో ఆటంకం లేకుండా మూల్యాంకనం జరుగుతుందని ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి.

అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతి

- వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

గుజరాతీపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మునిసిపల్ యాజమాన్య పాఠశాలలో ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతి జాబితాను వెబ్‌సైట్‌లో పొందపర్చామని డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. 'పాఠశాల విద్యా సంచాలకులు ఆదేశాల మేరకు అర్హులైన ఎస్జీటీ, పీఈటీ, తత్సమాన కేటగిరిల్లో సీనియారిటీ ప్రకారం స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాం. దీనిపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 8వ తేదీలోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి తెలియజేయాల'ని డీఈవో కోరారు.

తీరని శోకం

రోజూ మాదిరి తోటి మత్స్యకారులతో కలిసి.. సముద్రంలో చేపలవేటకు వెళ్లిన వారిద్దరూ మంగళవారం గల్లంతయ్యారు. అలల తాకిడికి బోటు బోల్తా పడగా.. నలుగురు మత్స్యకారుల్లో ఇద్దరు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. మిగిలిన ఆ ఇద్దరి ఆచూకీ కోసం పోలీసులు, గజ ఈతగాళ్లు రోజంతా గాలించారు. హెలికాప్టర్‌తో కూడా గాలింపు చర్యలు చేపట్టారు. వారు క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఎన్నో దేవుళ్లకు మొక్కుకున్నారు. గజ ఈతగాళ్లయిన వారిద్దరూ ఏదో చోట తీరానికి సురక్షితంగా చేరుకుంటారని భావించారు. కానీ, వారి రాక కోసం వేయి కళ్లతో ఎదురుచూసిన కుటుంబ సభ్యులకు నిరాశే ఎదురైంది. బుధవా రం డోకులపాడు, అక్కుపల్లి తీరాలకు వారి మృతదేహాలు కొట్టుకు రావడంతో.. తీరని శోకం మిగిలింది. వివరాల్లోకి వెళితే..

- డోకులపాడు, అక్కుపల్లి తీరాలకు కొట్టుకువచ్చిన మత్స్యకారుల మృతదేహాలు
- మంచినీళ్లపేటలో మిన్నంటిన రోదనలు
- బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే గౌతు శిరీష పరామర్శ
- ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల చొప్పున పరిహారం


ధనరాజు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, చిత్రంలో ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటకు చెందిన వంక కృష్ణ(44), బొంగు ధనరాజు(45) మృతదేహాలు.. బుధవారం అక్కుపల్లి, డోకులపాడు తీరాలకు కొట్టుకువచ్చాయి. మంగళవారం వేకువ జామున మంచినీళ్లపేటకు చెందిన బొంగు కోటేశ్వరరావు, చింత వెంకటేష్‌తో కలిసి సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. అలల ఉధృతికి బోటు బోల్తాపడి నలుగురూ సముద్రంలో పడిపోయారు. కొద్దిసేపటి తర్వాత కోటేశ్వరరావు, వెంకటేష్ ఒడ్డుకు చేరుకున్నారు. కానీ, కృష్ణ, ధనరాజు ఆచూకీ మాత్రం లభించలేదు. వారిద్దరి కోసం పోలీసులు రోజంతా గాలించారు. చివరకు వారి మృతదేహాలు బుధవారం ఉదయం అక్కుపల్లి, డోకులపాడు తీరాలకు కొట్టుకువచ్చాయి. మత్స్యకారులు బోటులో ఆ మృతదేహాలను మంచినీళ్లపేటకు తరలించారు. విగతజీవులుగా ఉన్న వారిద్దరినీ చూసి కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. సురక్షితంగా ఒడ్డుకు చేరుకుంటారని ఎన్నో దేవుళ్లకు మొక్కుకున్నా.. తమ మొర ఆలకించలేదని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు ఇక దిక్కెవరని విలపించారు. గ్రామస్థులు కూడా విషాదంలో మునిగిపోయారు. మృతదేహాలకు శవపంచ నామా నిర్వహించామని ఎస్ఐ బి.నిహార్ తెలిపారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం

మత్స్యకారులకు అండగా ఉంటామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. బుధవారం (మిగతా 6వ పేజీలో..)


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ఫేమస్ అవ్వడానికే.. చర్చి గోడలపై రాతలు

- ఇద్దరి అరెస్ట్
- ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి
- మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు
- జలుమూరు ఘటనపై 9 బృందాల దర్యాప్తు: ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'మతవిద్వేషాల ప్రేరేపిత గొడవల నేపథ్యంలో తాము కూడా ఫేమస్ అవుదామనే కోణంలో ఇద్దరు యువకులు చర్చి గోడలపై రాశారు. వారిద్దరినీ అరెస్ట్ చేశామ'ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 'శ్రీకాకుళం రెండవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని చిన్నబజార్ వీధిలో ఉన్న తెలుగు బాప్టిస్ట్ చర్చి, వన్‌టౌన్ పరిధి టౌన్‌హాల్ రోడ్‌లో ఉన్న ఆర్సీఎం సెయింట్ థామస్ చర్చి గోడలపై ఇద్దరు వ్యక్తులు జై శ్రీరామ్ అని రాశారు. వారిద్దరూ మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో స్కూటీపై చర్చిల వద్దకు వచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేసి గోడలపై పేర్లు రాశారు. ఈ విషయం తెలుసుకున్న రెండవ పట్టణ పోలీసుస్టేషన్ సీఐ పి.ఈశ్వరరావు, శ్రీకాకుళం సీఐ పైడపునాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మతవిద్వేషాలు, అల్లర్లు జరగకుండా ఉండేందుకు ముందుజాగ్రత్తగా వివరాలు సేకరించారు. అనంతరం రెండు చర్చిల గోడలపై రాతలను తొలగించారు. చర్చి పాస్టర్ల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన సీఐలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చర్చిలో సీసీ కెమెరాలు పని చేయలేదు. దీంతో రోడ్లపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల ద్విచక్ర వాహనాన్ని సీఐలు గుర్తించారు. శ్రీకాకుళం నగరం గూనపాలెం మేదరవీధికి చెందిన నర్రు దుర్గాప్రసాద్ (మిగతా 6వ పేజీలో..)



- మందస మండలం గుడ్డిభద్రలో జీడిచెట్లకు రైతు లక్ష్మణరావు పురుగుల మందు పిచికారీ చేస్తున్న దృశ్యమిది. ఇప్పటికే రెండు సార్లు మందులు చల్లగా.. ముచ్చటగా మూడోసారి కొడుతున్నారు. జీడిపూత నిలిచి పిందె దశలో టీదోమ నుంచి రక్షణ కోసం సస్య రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు మందు పిచికారీ చేసినా టీదోమ వదలడం లేదని వాపోతున్నారు. ఆ ప్రభావం దిగుబడిపై పడుతుందని దిగులు చెందుతున్నారు.



- మందస మండలం బిడిమి గ్రామం వద్ద తీర ప్రాంతంలోని జీడితోటలివి. ప్రతికూల పరిస్థితులతో పురుగు పోటుతో చిగురు, ఆకులు ఎండిపోయాయి. నాలుగురకాల చీడపీడలు ఆశించి చెట్లు ఇలా తయారయ్యాయని స్థానిక రైతులు ఆవేదన చెందుతున్నారు.

మాడిన పూత, పిందె


టీ దోమ ఆశించిటంతో.. జీడి పంట ఇలా..

- జీడి పంటకు ప్రతికూల వాతావరణం
- వెంటాడుతున్న తెగుళ్ల బెడద
- దిగుబడి తగ్గనుందని రైతుల ఆందోళన

హరిపురం/ కవిటి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో జీడి రైతులకు ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. ఓ వైపు ఆశించినస్థాయిలో వర్షాలు లేక ప్రతికూల వాతావరణం పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు జీడిపూతకు తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజులుగా పూత మాడిపోయి.. పిందె లు రాలిపోతున్నాయని వాపోతున్నారు. జిల్లాలో సుమారు 30వేల హెక్టార్లలో జీడి సాగు చేస్తున్నారు. చాలా మంది కొబ్బరి అంతర పంటగా జీడిని సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా పలాస, మందస, సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, మెళియాపుట్టి తదితర మండలాల్లో జీడిసాగు అధి కం. ఇక్కడినుంచి వస్తున్న పిక్కలే ప్రధాన ముడిసరుకుగా సుమారు 480 పరిశ్రమలు ఏర్పాటు చేశారు. కాగా గత పదేళ్లుగా వరుస తుఫాన్‌లతో పాటు తెగుళ్ల కారణంగా జీడిపంటకు నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది కూడా వర్షాలు లేక ఎండ వేడిమి, మంచు ప్రభావంతో జీడిచెట్లు ఎండిపోతున్నాయి. అలాగే తెగుళ్ల కారణంగా పూతతోపాటు లేత పిందెలు కూడా మసిబొగ్గులా మారి రాలిపోతున్నాయి. తోటల్లో 20శాతం పూత కూడా పిక్క గా మారడం లేదు. జీడి పంట ప్రారంభ దశలోనే టీ దోమ తెగులు వ్యాపించడంతో పాటు తామర పురుగులు, బూడిద తెగులు, ఫ్రూట్ జాక్స్ అధికంగా (మిగతా 6వ పేజీలో..)

బీమా అందజేయాలి..



జీడి రైతులకు ప్రభుత్వమే మందులు సరఫరా చేయాలి. ప్రస్తుతం మార్కెట్‌లో మందులు కల్తీ అవుతున్నాయి. పెట్టుబడి పెరిగి, దిగుబడి తగ్గి, ధరలు కుదేలై రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి, జీడి పంటకు బీమా అందించాలి.

-బైరిశెట్టి గున్నయ్య, జీడి రైతు, హరిపురం

సూచించిన మందులే వాడాలి..



జీడిపంటలో టీ దోమ, తామరపురుగు, పిండితెగులు, ఫ్రూట్‌జాక్ నుంచి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఏ సమస్య వచ్చినా వెంటనే కార్యాలయానికి సంప్రదించాలి.. పంటను పరిశీలించి.. తెగుళ్ల నివారణ మందులు సిఫారసు చేస్తాం. ఆ మందులే వాడాలి. బీమా కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

-శంకర్ దాస్, ఉద్యానవన శాఖాధికారి, మందస

గాలులు లేకపోవడమే..

జీడి పూత దశలో గాలులు లేకపోవడం తీవ్ర ప్రభావం చూపుతోంది. మంచు ప్రభావంతో జీడిపూత మాడి రాలిపోతోంది. ఈ ఏడాది దిగుబడి భారీగా తగ్గే ప్రమాదం ఉంది.

-జల్లు యుగంధర్, రైతు, జల్లుపుట్టుగ, కవిటి

ఆశలు వదులుకోవాల్సిందే..

ఈ ఏడాది జీడిపంట దిగుబడి మెరుగ్గా ఉంటుందని ఆశించాం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పూత మాడిపోయి కనిపిస్తోంది. ఇలాగే ఉంటే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రైతులు ఈ ఏడాది జీడిపై ఆశలు వదులుకోవాల్సిందే.

-గార గిరిబాబు, రైతు, కవిటి







అమ్మో.. కుక్కలు





- పట్టణాలు, పల్లెల్లో స్వైర విహారం
- గుంపులుగా తిరుగుతూ దాడి
- పిల్లల నుంచి వృద్ధుల వరకూ బాధితులే
- మూడేళ్లలో 23,170 మందికి కాట్లు

శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ప్రజలు వణుకుతున్నారు. నిత్యం ఎక్కడో ఒక చోట.. ఎవరో ఒకరు కుక్క కాటుకు గురవుతున్నారు. కుక్కల బెడదతో చిన్నారులను పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొంది. రాత్రి పూట విధులు ముగించుకుని వాహనాలపై ఇళ్లకు వెళ్లే వారిని వీధి కుక్కలు వెంటపడి కాటేస్తున్నాయి. ఇక వీటి నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్న వారు అధిక సంఖ్యలో ఉంటున్నారు. కుక్కల బెడదను నివారించేందుకు పశు సంవర్థక శాఖ, నగర పాలక యంత్రాంగం అరకొర చర్యలు చేపడుతుండటంతో సమస్య ఏళ్ల తరబడి అలాగే ఉండిపోతోంది.

పెరుగుతున్న బాధితులు..

జిల్లాలో రోజురోజుకూ కుక్క కాట్ల సంఖ్య పెరుగుతుండటంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఎక్కడికక్కడే కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా ఆడుకునే పిల్లలపైన దాడి చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. ఇటీవల నగరంలోని సంతోషిమాత ఆలయ సమీపంలో, హౌసింగ్ బోర్డు, జిల్లా పరిషత్ కాలనీ, బలగ, హాస్పిటల్ రోడ్డు, న్యూ కాలనీ, బలగ మెట్టు, ఇలిసిపురం, దమ్మల వీధి..ఇలా అనేక ప్రాంతాల్లో కుక్కలు వెంటపడి కాటేసిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్లేందుకు పెద్దవాళ్లే భయపడే పరిస్థితులు ఉంటున్నాయంటే వీటి ప్రభావం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో మనుషులపైనే కాకుండా పశువులు, గొర్రెలు, మేకల మందలపై దాడి చేస్తున్న సంఘటనలూ ఉంటున్నాయి. వీటి దాడిలో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పశువుల పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు.

నామమాత్రంగానే చర్యలు..

కుక్కల సంఖ్య పెరగకుండా ఉండేందుకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఖాజీపేటలో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని(ఏబీసీ సెంటర్) ఏర్పాటు చేశారు. కానీ అక్కడ కుక్కలకు ఆపరేషన్లు నామమాత్రంగానే జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రోజుకు 10 కుక్కలను తీసుకెళ్లి... ఆపరేషన్లు చేసి... మళ్లీ ఎక్కడ తెచ్చారో అక్కడ వదిలేస్తుంటారు. ఈ ప్రక్రియ నిరంతరం సాగకపోవడంతో కుక్కల సంఖ్య పెరుగుతూ వస్తోంది. శ్రీకాకుళం నగరంలోని 50 డివిజన్లలో సుమారు 2,500కు పైగా వీధి కుక్కలు ఉన్నాయని అధికారుల అంచనా. కొద్దికాలంగా ఏబీసీ సెంటర్ మూతపడటంతో కుక్కల సంఖ్యను నియంత్రించే చర్యలు నిలిచిపోయాయి. దీంతో నగర వాసులకు వీటి బెడద తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

23,170 మంది బాధితులు..

జిల్లాలో గత మూడేళ్లలో 23,170 మంది కుక్క కాటుకు గురైనట్లు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి లెక్కలు చెబుతున్నాయి.

- 2022-23 ఏడాదిలో 8,090 మంది కుక్క కాటు బారిన పడగా, 2023-24లో 7,177 మంది, 2024-25 మార్చి 31 నాటికి 7,903 మంది కుక్క కాటు బాధితులు ఉన్నారు. ఏటా అక్టోబర్ నుంచి మార్చి వరకు కుక్క కాట్ల సంఖ్య 700 నుంచి 900 వరకు ఉండటం గమనార్హం. కుక్క కాటు బాధితుల సంఖ్య ఏటా పెరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మరో వైపు ఏబీసీ సెంటర్లు మూతపడటం కూడా ఇటువంటి ప్రమాదాలు పెరగడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.
- కొత్తపేటకు చెందిన కె.రమేష్(8) అనే బాలుడు మార్చి 16న తన స్నేహితులతో రామ మందిరం వద్ద ఆడుకుంటుండగా గుంపులుగా కుక్కలు వచ్చి బాలుడి వెంటపడి కరిచాయి. ఇది గమనించిన స్థానికులు చిన్నారిని రిమ్స్‌కు తీసుకెళ్లి చికిత్స అందించారు.
- స్థానిక పాత హౌసింగ్ బోర్డు కోలనీలో నివశిస్తున్న ఎ.సుధీర్ అనే యువకుడు జనవరి 9న కళాశాలకు వెళ్లి.. తిరిగి ఇంటికి సైకిల్‌పై వస్తుండగా కుక్కలు దాడి చేశాయి. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు.
- నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వెళ్లే దారిలో ఉన్న హడ్కో కాలనీలో నివశిస్తున్న అన్నెపు రామకృష్ణ తన కొడుకు విశాల్‌తో కలిసి ఊరి నుంచి తిరిగి వస్తుండగా కుక్క కాటేసింది.

బాధితుల సంఖ్య పెరుగుతోంది..

గడిచిన మూడేళ్లలో కుక్క కాటుతో గాయాలపాలైన వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. జిల్లా వ్యాప్తంగా రోజూ సగటున 21 మందికి పైగా కుక్క కాటుతో రిమ్స్‌లో చేరుతున్నారు. కుక్కలను నియంత్రిస్తే తప్ప ఇటువంటి ప్రమాదాలను అరికట్టలేం.

-డాక్టర్ సుభాషిణి, ఆర్ఎంవో, రిమ్స్

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు..

నగర పాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్న మాట వాస్తవమే. వీటి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఖాజీపేటలోని ఏబీసీ కేంద్రంలో స్నేహ వెల్ఫేర్ సంస్థ ద్వారా వీధి కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నాం. రథసప్తమి సమయంలో 375 కుక్కలకు ఆపరేషన్లు చేశాం. మళ్లీ ఆపరేషన్లు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. పీహెచ్‌సీలలో ర్యాబిస్ వ్యాక్సిన్లు కూడా అందుబాటులో ఉంచాం.

-డా.కె.సుధీర్‌కుమార్, నగర పాలక ఆరోగ్య అధికారి

డేంజర్.. డేంజర్!

(ఐదో పేజీ తరువాయి)

భూగర్భ జలాలను తోడుతున్నారు. ఆ ప్రభావం ఎచ్చెర్ల నియోజకవర్గం మొత్తంపై పడిప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.



చుక్క నీరులేని బంటుపల్లి కంబాల చెరువు

● ప్రమాదకర స్థితిలో ఉన్నగ్రామాలు..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో 71 గ్రామాల్లో తీవ్ర నీటిఎద్దడి నెలకొనగా.. ఇందులో రణస్థలం మండలంలోనే 46 గ్రామాలు ఉండడం భయంగొల్పుతోంది. అక్కాయపాలెం, అర్జునవలస, బంటుపల్లి, బోయపేట, చిల్లపేట రాజాం, చిట్టివలస, దేరశాం, గిరివానిపాలెం, గోసం, జగన్నాథరాజపురం, జీరుకొవ్వాడ, కొండములగాం, కోష్ట, కోటపాలెం, కొచ్చెర్ల, కృష్ణాపురం, మహంతిపాలెం, మరువాడలో భూగర్భజలాలు అడుగంటాయి. అలాగే మెంటాడ, ముక్తంపురం, నరసింహగోపాలపురం, నారువా, నెలివాడ, పాపారావుపేట, పాతర్లపల్లె, పాత సుందరపాలెం, పిసిని, పైడిభీమవరం, రామచంద్రాపురం, రణస్థలం, రావాడ, సంచాం, సీతంవలస, సీతంపేట, సూరంపేట, సూరపురం, టెక్కలి, తెప్పలవలస, తిరుపతిపాలెం, ఉప్పివలస, వల్లభరావుపేట, వరాహ నరసింహపురం, వరిశాం, వెల్పురాయి, వెంకటరావుపేట, ఎర్రవరం గ్రామాల్లో కూడా నీటిఎద్దడే. దాదాపు రణస్థలం మండలం మొత్తం ప్రమాదంలో ఉన్నట్టే. వీటికితోడు జి.సిగడాం మండలంలో 6, ఎచ్చెర్ల మండలంలో ఒకటి, లావేరు మండలంలో 18 గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయినట్టు అధ్యయనంలో తేలింది. ఈ గ్రామాల్లో బోర్లు, ఇతర తాగునీటి వనరుల తవ్వకం నిషేధం. కానీ ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఇవి చేస్తే మేలు..

జిల్లాలో భూగర్భ జలాలను పెంచేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా తోటపల్లి కాలువకు పుష్కలంగా సాగునీరు అందించాలి. అదే సమయంలో పైడిభీమవరం చెంతనే ఉన్న కందివలస గెడ్డను ఆధునికీకరించాలి. గెడ్డలో ఉన్న పూడికను తొలగించాలి. పరిశ్రమలు వ్యర్థాలు వదలకుండా కట్టడి చేయాలి. లావేరు మండలంలో ఉన్న బుడుమూరు గడ్డను సైతం ఆధునికీకరించాలి. ఎచ్చెర్ల మండలంలో ఉన్న నారాయణవలస కాలువను పునరుద్ధరించాలి. ఈ చర్యలతోనే ఎచ్చెర్ల నియోజకవర్గానికి భవిష్యత్‌లో నీటి గండం లేకుండా చూడవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తోటపల్లి నీరు ఇవ్వాలి..


తోటపల్లి నీరు వస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. టీడీపీ పాలనలో పుష్కలంగా తోటపల్లి నీరు రావడంతో రైతులు పంటలు పండించారు.భూగర్భ జాలాలు పుష్కలంగా పెరిగాయి. గత వైసీపీ పాలనలోతోటపల్లి కాలువ నుంచి చుక్కనీరు కూడా రాలేదు. రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. తోటపల్లి నీరు త్వరితగతి విడుదల చేయాలి.

-దన్నాన సత్తిబాబు, రైతు, కొండములగాం

నీటి ఆదా అవసరం

వర్షపు నీటిని ఆదా చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత తవ్వుకోవాలి. అప్పుడే భూగర్భ జలాలు ప్రమాదకర స్థితిలోకి వెళ్లవు. మరోవైపు పారిశ్రామిక అవసరాలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటే.. నీటి కొరత రాదు. దీనిపై ప్రజల్లో కూడా అవగాహన పెరగాలి.

-రమణమూర్తి, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారి, శ్రీకాకుళం



గ్రానైట్ క్వారీల్లోని బ్లాకులు



నిలిచిన రవాణా వాహనాలు

కదలని గ్రానైట్ బ్లాకులు

- 16 రోజులుగా నిలిచిన పర్మిట్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

టెక్కలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ బ్లాకులకు పర్మిట్ల జారీ ప్రక్రియ గత 16 రోజులుగా నిలిచిపోయింది. ఫలితంగా నీలిరంగు గ్రానైట్ పరిశ్రమల యాజమాన్యాలకు మరోసారి గడ్డు పరిస్థితి ఎదురైంది. గ్రానైట్ క్వారీల నుంచి తయారయ్యే బ్లాకులు మోర్నమెంట్ ఫ్యాక్టరీలకు, విదేశాలకు షిప్పింగ్ ద్వారా తరలించాలన్నా.. కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లకు తరలించాలన్నా బ్లాకులకు క్యూబిక్ మీటర్ల పరిధిలో సీనరేజ్ చార్జీలు వసూలు చేస్తుంటారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విశ్వసముద్ర సంస్థ సుమారు నెలకు రూ.12కోట్లు చొప్పున చెల్లించి జిల్లాలో టెండర్లు దక్కించుకొని... గ్రానైట్ క్వారీల బ్లాకులకు సీనరేజ్ చార్జీలు వసూలు చేస్తుండేది. 2024లో కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన తరువాత విశ్వసముద్రను పక్కనపెట్టింది. ఏఎంఆర్ సంస్థ సీనరేజ్ చార్జీలు వసూలు చేసేది. వారి కాంట్రాక్ట్ కాలపరిమితి ఈ ఏడాది మార్చి 17తో పూర్తికావడంతో జిల్లాలో పర్మిట్ల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. సుమారు 12వేల క్యూబిక్‌మీటర్ల గ్రానైట్ బ్లాకులు ఈ ప్రాంత క్వారీల నుంచి వెళ్లాల్సి ఉంది. కానీ ప్రస్తుతం కదిలే పరిస్థితి లేదు. ఈ కారణంగా ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి పడుతోంది. పర్మిట్లు నిలిచిపోవడంతో విదేశీ, స్వదేశీ బయ్యర్లు సైతం క్వారీ యాజమాన్యాలకు చెల్లింపులు నిలిపివేశారు. క్వారీల్లో గ్రానైట్ బ్లాకులు పేరుకుపోతుండడంతో యాజమాన్యాలకు ఆర్థిక భారంగా మారుతోంది. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఆఫ్‌లైన్ పర్మిట్లను ఆన్‌లైన్‌లోకి మార్చింది. దీంతో 4 నెలల పాటు పర్మిట్లు నిలిచిపోయాయి. తాజాగా 16 రోజుల పాటు నిలిచిపోవడం యాజమాన్యాలకు ఆందోళనకలిగిస్తోంది. ఈ పర్మిట్ల జారీ బాధ్యతను ఏవైనా సంస్థలకు ఇస్తారా? లేక గనులు శాఖ చేపడుతుందా అర్థంకాక మరికొంతమంది తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు బ్లాకుల రవాణా నిలిచిపోవడంతో ట్రాన్స్‌పోర్ట్ రంగం కూడా కుదేలైంది. ట్రాన్స్‌పోర్ట్ యాజమానులకు పనులు లేక లబోదిబోమంటున్నారు.

తీరని శోకం

(ఐదో పేజీ తరువాయి)

మంచినీళ్లపేటలో మృతుల కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి.. ఓదార్చారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు మత్స్యశాఖ తరపున రూ.5లక్షలు, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మరో రూ.5 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు.. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లడంతో తక్షణ పరిహారం ప్రకటించారని వెల్లడించారు. అలాగే ప్రమాదంలో బయటపడిన బోటు యజమాని బుంగ కోటేశ్వరరావుతో ఆమె మాట్లాడారు. బోటు మరమ్మతుకు రూ.50 వేలు చెక్కుతోపాటు బోటు ఇంజన్, వల అందజేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక మాజీ సర్పంచ్ గుల్ల చిన్నారావు, పీరుకట్ల విఠల్,



కోటేశ్వరరావుకు ఇంజన్, వల, చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

బుల్లోజు శశిభూషణ్, పుచ్చ ఈశ్వరరావు, సూరాడ మోహనరావు, అరసవెల్లి ఉమామహేశ్వరరావు, గోవింద్, పాపారావు ఉన్నారు.

మాడిన పూత, పిందె

(ఐదో పేజీ తరువాయి)

ఏర్పడి పంటను సమూలంగా నాశనం చేస్తు న్నాయి. పురుగుల మందు పిచికారీ చేస్తున్నా తెగుళ్ల బెడద వదలడం లేదని రైతులు వాపోతున్నారు.

దిగుబడిపై ప్రభావం..

ఏటా తుఫాన్‌లు, ప్రతికూల వాతారణ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా జీడి దిగుబడి తగ్గుతోంది. ఈ ఏడాది ఎకరాకు ఐదు నుంచి పది బస్తాలు దిగుబడి వస్తుందని మొదట్లో అధికారులు అంచనా వేశారు. కానీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తే ఎకరాకు 4 బస్తాల దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదని రైతులు పేర్కొంటున్నారు. దీని ప్రభావం జిల్లాలోని జీడి పరిశ్రమలపై పడనుంది. ముడిసరుకులేక పరిశ్రమలు మూతపడే పరిస్థితి కనిపిస్తోంది. వ్యాపారులకు విదేశాల నుంచి దిగుమతి చేసే పిక్కలే దిక్కులా మారాయి. కాగా, దిగుమతి పిక్కలపై జీడి సుంకం పెంచడంతో అవీ గిట్టుబాటు కాక, స్థానికంగా ముడిసరకు దొరక్క పరిశ్రమలు గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నాయి.

దేవీ ఆశ్రమంలో వసంత పంచమి పూజలు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కుంచాల కురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో బుధవారం వసంత పంచమి పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరిదేవికి ప్రత్యేకంగా అలంకరించి, 400 కిలోల కుంకుమతో పూజలు నిర్వహించారు. అనంతరం రాజ శ్యామల హోమం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



రాజరాజేశ్వరి దేవికి కుంకుమ పూజలు చేస్తున్న పీఠాధిపతి బాలభాస్కరశర్మ



రాజశ్యామల హోమంలో పాల్గొన్న భక్తులు

ఫేమస్ అవ్వడానికే.. చర్చి గోడలపై రాతలు

(ఐదో పేజీ తరువాయి)

అలియాస్ ప్రసాద్, గ్రంధి సోమశేఖర్ ఈ ఘటనకు పాల్పడినట్టు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వారిద్దరూ మద్యం సేవించి.. ఎర్ర రంగు డబ్బాను చర్చిల వద్దకు తీసుకెళ్లారు. ఎలక్ట్రికల్ పనులు చేసే సోమశేఖర్.. చర్చిల్లో విద్యుత్ వైర్లు కట్ చేసి.. గోడలపై రాతలు రాసి.. ద్విచక్ర వాహనంపై పరారయ్యారైనట్టు గుర్తించారు. వారిద్దరూ బుధవారం అరసవల్లి మామిడితోట వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వారిని విచారించగా ఆ రాతలు రాసినట్టు అంగీకరించారు. జలుమూరులో ఆలయాలపై రాతలు, పాస్టర్ ప్రవీణ్ మరణం లాంటి విషయాలను సోషల్ మీడియాలో చూసి తాము కూడా అలానే చేసి ఫేమస్ అవ్వాలనే ఆలోచనతో ఈ పని చేసినట్టు అంగీకరించారని ఎస్పీ వివరించారు.

● కఠిన చర్యలు తప్పవు..

దేవాలయాలు, చర్చిలు, ప్రజలు అధికంగా వచ్చే ప్రాంతాల్లో ఎదుటివారి మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తే.. కఠినచర్యలు తప్పవని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. 'కుల,మత,రాజకీయ వర్గాల మధ్య మత విద్వేషాలు రగిల్చేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే కేసులు నమోదు చేసి కఠిన శిక్ష అమలు చేస్తాం. జిల్లాలోని ఆలయాలు, చర్చిల వద్ద సీసీ కెమెరాలు, యూత్ కమిటీలు ఏర్పాటు చేయాలి. సెక్యూరిటీగార్డులను నియమించుకోవాలి. హుండీలకు భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలి. జలుమూరు ఘటన కానీ, శ్రీకాకుళంలో చర్చి గోడలపై రాతల విషయంలో గానీ ఎక్కడా సీసీ కెమెరాలు పని చేయలేదు. ఇప్పటికే ఆలయాల, చర్చి కమిటీ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి కెమెరాలు పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జలుమూరు ఘటనపై 9 బృందాలు పని చేస్తున్నాయి. ఇప్పటికే 42 సీసీ కెమెరాలు పరిశీలించాం. 665 ద్విచక్రవాహనాలను గుర్తించి అందరినీ విచారణ చేశాం. 190 మంది అనుమానితులను ప్రశ్నించాం. నిందితులు స్ప్రే వాడటంతో కెమికల్ సంబంధిత షాపుల్లో కూడా దర్యాప్తు చేస్తున్నాం. నేరాలు అరికట్టేందుకు మీడియా, ప్రజలు సహకరించాల'ని ఎస్పీ కోరారు. శ్రీకాకుళంలో ఒక్కరోజులో కేసును ఛేదించిన డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ కె.పైడపునాయుడు, టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు, హోం గార్డు నరేష్, ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సీసీ కెమెరాలు పనిచేయనప్పటికీ నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులకు రివార్డులు ప్రకటించారు. ఏఎస్పీ కేవీ రమణ, ఎస్పీ సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ పాల్గొన్నారు.



రేపటి నుంచి ఆదిత్యుని కల్యాణోత్సవాలు

అరసవల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి కల్యాణోత్సవాలు ఈ నెల 4వ తేదీ శుక్రవారం చైత్రశుద్ధ సప్తమి నుంచి 12వ తేదీ శనివారం వరకు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ తెలిపారు. 4న కల్యాణాంగ ధ్వజారోహణం, 7న సుగంధ ద్రవ్య మర్ధన, 8న శ్రీఉషా, ఛాయ, పద్మినీ సమేతంగా ఆదిత్యుని కల్యాణ మహోత్సవం ఉంటాయి. 9న ఆగ్నేయ స్థాలీపాక హోమాదులు, 10న సదస్యం, మహదాశీర్వచనాలు, 11న తిరుమంగయాళ్వారుల చరిత్ర సంవాదం, 12న నాకబలి ప్రయుక్త చక్రతీర్ధ స్నానం జరుగుతుంది. అనంతరం ధ్వజావరోహణ చేస్తామన్నారు. అదే రోజు సాయంత్రం పుష్పయాగం, ఏకాంతసేవతో కార్యక్రమాలు ముగుస్తాయి. కల్యాణంలో పాల్గొనదలచిన భక్తులు రూ.500 చెల్లించాలన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం తన కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ, గ్రామ సచివాలయాలు, నీటి యాజమాన్య సంస్థ, గృహ నిర్మాణం, పారిశుధ్యం, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె పండుగ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ఉపాధి హామీ పథకంలో పని దినాలను పెంచాలని ఆదేశించారు. గృహనిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్త నుంచి సంపద తయారీని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే పీజీఆర్ఎస్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సదస్సులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ల్యాండు బ్యాంకుల నిర్వహణ, కోర్టు కేసుల పరిష్కారం, వక్ఫ్ ఆస్తుల సర్వే తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్వో వేంకటేశ్వరరావు, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీవో భారతీ సౌజన్య, వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డ్వామా పీడీ సుధాకర్, హౌసింగ్ పీడీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

కంచిలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గొప్ప సైనిక వ్యూహకర్త, మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. స్థానిక బీసీ వసతి గృహం ఆవరణలో పదో తరగతి విద్యార్థుల ఆర్థిక సాయంతో నిర్మించిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో శివరాంప్రసాద్, సర్పంచ్ లండ లక్ష్మి, నాయకులు బంగారు కురయ్య, జగదీష్ పట్నాయక్, మద్దిల కేశవరావు, పైల పురుషోత్తం రెడ్డి, వార్డెన్ గుల్ల రామారావు, వసతిగృహ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి పనులు పూర్తి చేయించండి

కవిటి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తిచేయించాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు వినతి పత్రాన్ని అందించారు. రామయ్యపుట్టుగలో బుధవారం కలిసిన ప్రతినిధులు, సాగునీటి వనరుల స్థితిగతులను వివరించారు. సాగునీటి వనరులున్నా పంటలకు అందని దుస్థితి ఏర్పడిందన్నారు. బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, బీసీ సెల్ లీగల్ అడ్వైజర్ లక్ష్మణరావు, సభ్యులు జి.దేవరాజు, శ్రీనివాస్, కృష్ణమూర్తి, నారాయణస్వామి, రామ్మూర్తి, నీలయ్య పాల్గొన్నారు.

ఎంఈవోగా సుజాత బాధ్యతలు

శ్రీకాకుళం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఎంఈవోగా పెంకి సుజాత బుధవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం సుజాత గార మండలం బందరువానిపేట హైస్కూల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావు కొద్ది రోజుల కిందట అనారోగ్యంతో మరణించారు. దీంతో ఈయన స్థానంలో అదనపు బాధ్యతల (ఎఫ్ఏసీ)పై సుజాతను నియమించారు.

బాధ్యతగా పనిచేస్తా..



డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న దాసరి రాజు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జనసైనికులకు జీవితాంతం రుణపడి ఉంటానని ఇచ్ఛాపురం నియోజకవర్గం ఆ పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బుధవారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనకు ఇంతటి అవకాశం కల్పించిన జనసేన పార్టీ వ్యవస్థాపకులు పవన్ కల్యాణ్, పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీలు నాగబాబు, హరిప్రసాద్, నాయకులు తమ్మిరెడ్డి శివశంకర్, నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం



సింహాచలానికి స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

బూర్జ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అన్నంపేట గ్రామానికి చెందిన మామిడి సింహాచలం 22 ఏళ్లుగా ఇండియన్ ఆర్మీలో సేవలందించారు. ఈ క్రమంలో రిటైరు అయి బుధవారం స్వగ్రామానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. లవ్లీ యూత్ ఆధ్వర్యంలో సింహాచలంతో పాటు ఆయన కుటుంబ సభ్యులను సత్కరించారు. తనపై గ్రామస్థులు చూపిన అభిమానానికి సింహాచలం కృతజ్ఞత తెలిపారు.

థెరపీలతో ఆటిజం పిల్లలకు ప్రయోజనం

అరసవల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి(రిమ్స్)లో ఆటిజంతో బాధపడుతున్న పిల్లలకు వివిధ రకాల థెరపీలను బాల భవిత కేంద్రం ద్వారా అందిస్తున్నట్టు ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వెంకటరావు అన్నారు. ప్రపంచ ఆటిజం డే కార్యక్రమాన్ని ఆసుపత్రిలోని జిల్లా బాల భవిత కేంద్రంలో బుధవారం జరిగింది. క్లినికల్ సైకాలజిస్టు ఆర్.రాజకుమార్, చిన్నపిల్లల వైద్యనిపుణులు నూక చైతన్య, ఫిజియోథెరపిస్టు పాల్గొన్నారు.

రుణప్రణాళిక అమలులో అలసత్వం వద్దు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రుణ ప్రణాళిక అమలులో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ప్రోజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వీవోఏలు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీ సీహెచ్ రామ్మోహన్‌రావు, ఏజీఎం కె.సత్యనారాయణ, ఏపీఎం ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణలో ప్రవేశాలు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 11వ తేదీన పలు కోర్సులకు శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైలరింగ్, కంప్యూటర్ అకౌంటెన్సీ కోర్సుల్లో 19-40 ఏళ్ల లోపు వయసు గల మహిళలు చేరేందుకు అర్హులని చెప్పారు. 30 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 9553410809, 7993340407 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

మూడు నెలల్లో పూర్తి చేయాలి

సోంపేట, ఏప్రిల్ 2(ఆంధ్ర జ్యోతి): పట్టణంలో అసంపూర్తిగా ఉన్న హుద్‌హుద్ ఇళ్లు మూడు నెలల్లో పూర్తిచేసి లబ్ధిదారులకు అందేలా చూడాలని హౌసింగ్ కార్పొరేషన్ అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ సి.జయరాం ఆచారి తెలిపారు. 'హుద్‌హుద్ ఇళ్లు అప్పగించేనా' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన కథనంపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో కలిసి బుధవారం పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈఈ నరసింగరావు, అప్పారావు, డీఈఈ సత్యాజీ తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో అరసవిల్లి నుంచి మిల్లు జంక్షన్ వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి అతివేగంగా వస్తున్న మరో ద్విచక్రవాహనం బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఢీకొట్టింది. ఈ ఘటనలో నగరంలోని ఇప్పిలివీధికి చెందిన యోగేశ్వరరావుతో పాటు వెనుక కూర్చున్న మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. అయితే ప్రమాదానికి కారణమైన బైక్‌ను అక్కడే వదిలేసి బైక్ పై వస్తున్న వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. గాయాలతో పడి ఉన్న క్షతగాత్రులను ట్రాఫిక్ పోలీసులు ఆటోలో రిమ్స్‌కు తరలించి, ఢీ కొట్టిన ద్విచక్ర వాహనాన్ని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ప్రమాదకరంగా..

నరుబుజ్జిలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత ఆవరణలో ఉన్న ఒక పాఠశాల భవనం ప్రమాదకరంగా కనిపిస్తుంది. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్నత పాఠశాల, అలాగే బాలికల ఇంటర్మీడియట్, ప్రాథమి క పాఠశాల అంగన్‌వాడీ కేంద్రం ఇదే పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. అయితే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సం బంధించిన ఒక భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఒక భవనానికి కిటి కీలు వద్ద ఏర్పాటు చేసిన కాంక్రీట్ శ్లాబ్ పలకలు విరిగిపోయి వేలాడుతుంది. గోడలు కూడా భారీ స్థాయిలో పగుళ్లు ఇచ్చి భయాందోళన కలిగిస్తుంది. దీని పరిసరాల్లో విద్యార్థులు వి శ్రాంతి సమయంలో ఆడుకోవడం చేస్తుం టారు. ఎటువంట ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి దీన్ని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న పాఠశాల భవనం

రెండు నెలలుగా ఇంతే

పొందూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ వచ్చిన తర్వాత గ్రామాలకు బీటీ, సీసీ రహదారుల నిర్మాణాలపై దృష్టి సారించింది. కాని క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యం వల్ల నిర్మాణాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. నిర్మాణాలకు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని గ్రామానికి చెందిన సర్పంచ్‌లు, స్థానిక నాయకులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయి. తుంగపేట గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామంలో రూ.12 లక్షలతో రావిచెట్టువీధిలో ప్రారంభించిన రోడ్డు పనులు రెండు నెలలుగా ముందుకు కదలడం లేదు. గ్రామానికి చెందిన వ్యక్తి రోడ్డు నిర్మాణం మధ్యలో గడ్డి కుప్పలతోపాటు రేకులు, ఇంటి నిర్మాణం సామగ్రి ఉండడంతో నిర్మా ణానికి ఆటంకం కలిగింది. దీనిపై సర్పంచ్ పప్పల వేణు తహసీల్దార్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వేయర్ ఆ స్థలం గ్రామ కంఠం, ప్రభుత్వ పోరంబోకు స్థలంగా నిర్ధారించినా ఆ స్థలంలో ఉన్న సామానులు తీయకపోవ డంతో రోడ్డు నిర్మాణం ముందుకు సాగలేదు. దీనిపై బుధవారం మరోసారి సర్పంచ్ వేణుగోపాల రావు రెవెన్యూ, పోలీసు అధికా రులకు ఫిర్యాదు చేశారు. అధికా రులు చర్యలు తీసుకుని రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నిలిచిపోయిన రోడ్డు పనులు

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ఎన్ఈఆర్, ఎచ్చెర్ల కూటమి నేతలు

రణస్థలం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు నియోజకవర్గ కూటమి నేతలతో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. నియోజకవర్గంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టు కాలువల నిర్మాణం పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధవహిస్తానని హామీ ఇచ్చారు. త్వరలో నియోజకవర్గంలో పర్యటిస్తానని కూటమి నేతలకు తెలియజేశారు. అదేవిధంగా పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజను ఎమ్మెల్యే ఎన్ఈఆర్ కలిసి ఇంతవరకూ కొన్ని పచాయతీలకు ఎన్నికలు జరగలేదని, వాటికి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కూటమి నేతలు చౌదరి బాబ్జీ, లంక శ్యామలరావు, ముప్పిడి సురేష్, డీజీఎం ఆనందరావు, బెండు మల్లేశ్వరరావు, విశ్వక్సేన్, పిషిని జగన్నాథంనాయుడు, పిన్నింటి భానూజినాయుడు, రవి, లంక ప్రభ, కనకారావు, పిన్నింటి మధు తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి నాలుగు కొలువులు



కుటుంబ సభ్యులతో నక్క జ్యోత్స్న

ఆమదాలవలస, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని బొడ్డేపల్లి రాజగోపాలరావు నగర్ (బీఆర్ నగర్)లో నివాసం ఉంటున్న జ్యోత్స్నకు రెండు రోజుల కిందట విడుదలైన ఫలితాల్లో ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలు, ఎల్ అండ్‌టీలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా ఎంపికైంది. బూర్జ మండలం ఓవీ పేట గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు రామ్మూర్తి, కుమారి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉద్యోగరీత్యా వీరి కుటుంబం బీఆర్ నగర్‌లో ఉంటున్నారు. విజయనగరం జేఎన్‌టీయూలో ఇంజనీర్‌గా ఈఈఈ పూర్తిచేసిన జ్యోత్స్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పీవోగా ఎంపికై కొలువుదీరారు. ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ మహా రాష్ట్ర పీవోగా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వర్క్ పోస్టులకు, ఎలక్ట్రికల్ ఇంజనీర్ పోస్టులకు ఎంపికైంది. రామ్మూర్తి కుమారుడు తరుణ్ కూడా తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఏపీలో కెనరా బ్యాంక్‌కు ఎంపికయ్యాడు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజా దర్బార్‌లో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఆమదాలవలస, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పల్లె పండుగతో గ్రామాల్లో అభివృద్ధి చేపట్టామని, పీ-4తో పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యాలయ సమన్వయ కార్యదర్శి మొదలవలస రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు నూక రాజు, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి గౌరీపతి, దూసి ఆయకట్టు చైర్మన్ హనుమంతు బాలకృష్ణ, నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు నాగళ్ల మురళీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

శ్రీకాకుళం కలెక్టరేట్/ గుజ రాతీపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగుల కు సంబంధించి కారుణ్య నియామకాలు చేపట్టాలని, పీఆర్సీ వేసి ఐఆర్ ప్రకటించాలని ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు బమ్మిడి శ్రీరామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద బుధవారం సాయంత్రం నిరసన ప్రదర్శన తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన 90శాతం డీఏ బకాయిలు, సీపీఎస్ మినహాయింపు మొత్తం వారి ఖాతాల్లో జమచేయాలని, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలయని, పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపులకు రోడ్డు మ్యాప్‌ను ప్రకటించాలని కోరారు.

అమెరికాలో టీడీపీ సంబరాలు



ఎన్ఆర్ఐలతో ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీగా ఆవిర్భవించిన టీడీపీ సంబరాలు అమెరికాలో ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే, పీ యూసీ చైర్మన్ కూన రవికుమార్ ఆధ్వర్యంలో సెయింట్ లూయిస్‌లో టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం నాయకులు టీడీపీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. యువ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడలు పెట్టి ఆదర్శంగా నిలవాలని, యువతకు ఉపాధి కల్పించేందుకు ఎన్ఆర్ఐలు కృషి చేయాలని కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం స్థానిక విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో ఆయన నియోజకవర్గంలోని గార, శ్రీకాకుళం మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లకు ఏఎస్‌వోలుగా పదోన్నతుల కల్పించే విషయమై కమిటీ జీవోను వెనక్కు తీసుకున్న నేపథ్యంలో నిర్ణయాన్ని పునరాలోచన చేసి న్యాయం చేయాలని వారంతా ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

ఉపాధ్యాయులతో చర్చలు సఫలం

శ్రీకాకుళం కలెక్ట రేట్/ గుజరాతీపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యో తి): జిల్లా కేంద్రంలో ఈ నెల 3వ తేదీ నుం చి జరగనున్న పదో తరగతి మూల్యాంక నం యథావిధిగా సాగనున్నట్టు ఉమ్మడి ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి వరకు కలెక్టరేట్‌లో జేఏసీ చైర్మన్ హనుమంతు సాయిరాం సమక్షంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. డీఈవోను విధుల నుంచి తప్పించాలని, మిలిగిన ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలని, అలాగే ఉపాధ్యాయులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని కోరారు. ఆ వ్యవహారంలో 15మందిని డీఈవో సస్పెండ్ చేశారని, వారిలో 13 మందిపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్టు కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఆర్జేడీ పర్యవేక్షణలో స్పాట్ వాల్యూయేషన్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టొద్దు



కలెక్టరేట్ గేటు వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): హేతుబద్ధత లేని ఎస్సీ వర్గీకరణ చేపట్టొద్దని, రెల్లి గ్రూప్ కులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్సీ రెల్లి కుల జాతీయ జాతీయ కార్యదర్శి పి.సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఏ.కోటి, నగర అధ్యక్షుడు అర్జి ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సుమారు 300 మంది బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో వెనుకబాటు తనానికి ప్రాధాన్యత ఇవ్వాలని, సుప్రీంకోర్టు 2004లో ఇచ్చిన ఆదేశాలు, సూచనలు అమలు చేయాలని కోరుతూ డీఆర్వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

అరసవిల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్ర దాత అరసవిల్లి సూర్యనా రాయణ స్వామి ఆలయంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదానానికి జిల్లాకు చెందిన బచ్చు వరలక్ష్మి రూ.లక్ష విరా ళాన్ని అందజేశారు. బుధవారం ఆలయంలో సీనియర్ సహాయకులు ఎ.శోభనాచార్యులుకి అందించారు.

రిమ్స్‌లో అంబులెన్స్ డ్రైవర్ల మధ్య వివాదం

● గాయపడిన వారిని దారి కాచి దాడిచేసిన రెల్లివీధి యువత

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో బుధవారం అంబులెన్స్ డ్రైవర్ల మధ్య కొట్లాట చోటుచేసుకుంది. గడిచిన కొద్ది రోజులుగా రిమ్స్‌లో ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ల మధ్య వివాదం నడుస్తుంది. బుధవారం కొత్త బ్రిడ్జి రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రి వర్గాలు అంబు లెన్స్ డ్రైవర్లకు పార్టీ ఇచ్చాయి. ఈ క్రమంలో డ్రైవర్ల మధ్య వివాదం చోటు చేసు కుంది. ఈ గొడవలో హరి అనే యువకుడికి గాయపడ్డాడు. దీనిపై బాధితులు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎంఎల్‌సీ కోసం రిమ్స్‌లో చికిత్స తీసుకు నేందుకు వెళ్తుండగా హరి, రామకృష్ణ, శంకర్‌లపై రెల్లివీధికి చెందిన కొంత మంది అడ్డగించి దాడి చేశారు. ఈ దాడిలో హరికి తీవ్ర గాయాలు కాగా, శంకర్, రామకృష్ణ గాయపడ్డారు. ఇదిలా ఉండగా ఈ గొడవలో రెల్లివీధికి చెందిన ఓ రౌడీషీటర్ ఉన్నట్టు సమాచారం. దీనిపై టూటౌన్ సీఐ ఈశ్వరరావుకి వివరణ కోరగా.. గొడవ జరగడం వాస్తవమేనని, ఈ ఘటనపై కేసు నమోదు చేయనున్నట్టు తెలిపారు.

8న జడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటల నుంచి జడ్పీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి గౌరవ సభ్యులు హాజరు కావాలని కోరారు.

కళాకారునికి సత్కారం

కవిటి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉత్కళ్‌దివస్ ఉత్సవాల్లో భాగంగా కన్నుపుట్టుగకు చెందిన కళాకారుడు హత్తి లావణ్యకుమార్‌ను సత్కరించారు. ఎర్ర గోవిందపుట్టుగ గ్రామంలో బుధవారం కన్యకాపరమేశ్వరి కళింగ వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారునికి దుశ్శాలువ, జ్ఞాపికను అందించారు. సంఘ అధ్యక్షుడు ఇ.జగన్నాథరావు, రమేష్ పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో జిల్లాస్థాయి బాడీ బిల్డింగ్ ఎంపికలు జరిగాయి. బుధవారం జరిగిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొనగా అందులో ఐదుగురిని ఎంపిక చేసనట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తారకేశ్వరరావు, కార్యదర్శి కె.గౌరీశంకర్ తెలిపారు. ఇందులో ఎంపికైన వారు ఈ 4న భీమవరంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన వారిలో బి.అభి, వైకుంఠ, ఎస్.బన్నీ, సుమంత్, ఎం.రాంబాబు ఉన్నట్టు సంఘ ప్రతినిధి బి.విజయ్‌కుమార్ తెలిపారు.

6న శ్రీరామనవమి ఉత్సవాలు

సోంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బారువ జనార్దన స్వామి ఆలయంలో ఈ నెల 6వ తేదీ ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఆ రోజు ఉదయం స్వామివారి నిజరూప దర్శనం, పంచామృత అభిషేకాలు ఉంటాయన్నారు. ఉద యం 10గంటలకు స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటదన్నారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

ఎచ్చెర్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల (కుశాలపురం)లో గురువారం నుంచి పాలిసెట్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థినులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ టి.విక్టర్‌పాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోచింగ్ ప్రతి రోజు ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ నెల 30వ తేదీన పాలిసెట్ జరగనుందన్నారు.

Andhra Pradesh State Financial Corporation
(Incorporation Under the State Financial Corporation Act, LXIII of 1951)
CFC-2, Industrial Area, A.P.I.I.C. Kusalapuram,
SRIKAKULAM-532005. PHONE NO. 08942-295973

PUBLIC NOTICE

The general public / Financial Institutions / Banks are hereby informed by M/s. A.P. State Financial Corporation (A.P.S.F.C), that, our Corporation has sanctioned working capital Term Loan under Marketing Assistance Scheme of Rs. 49.00 lakhs (Rupees Forty Nine Lakhs only) to M/s. SAGAR JEWELLERS, Proprietor: Sri Maroju Vidya Sagar S/o. (Late) Sri M.Rambabu, D.No.9-91, Post office Road, Logidi Street, Palakonda, Srikakulam Dist.-532440, against the following Collateral security property.

It is informed to us that the Scheduled property is owned and possessed by Proprietor: Sri Maroju Vidya Sagar (Surety) and agreed to mortgage below scheduled property as Collateral security by way of Memorandum of deposit of title deeds i.e., by depositing originals of (1) Registered Sale Deed Date: 03.04.2024 Doc.No.4081/2024, (2) Public copy of Registered Sale Deed Date: 10.01.2024 Doc.No.66/2024, Sale Deed Date: 04.10.2021 Doc.No.2238/2021, Sale Deed Date:06.05.1977, registered with SRO Palakonda along with link documents and supporting docuemnts, in favor of A.P.S.F.C. for the loan to be sanctioned to M/s. SAGAR JEWELLERS.

Hence the general public is hereby informed to file objections, claims, interest and rights or titles if any what so ever in respect of scheduled property for this proposed mortgage, with documentary proof / evidences in writing to the undersigned within Seven days from the date of this notification. Otherwise this property is taken as mortgage as clear title and subsequent objections will not be entertained and not binding on the Corporation thereafter.

SCHEDULE OF THE PROPERTY's

Free hold interest in Residential Vacant site/ land 386.86 sq. yards, Nearest Door No. 1-115, Survey No. 42-2, Korikanakumarajapuram Village Revenue Account No. 187, Appalapeta Panchayat, Burja Mandal, Palakonda Sub-Division, Srikakulam District bounded by: North : Wet land of Patiwada Tiruapathirao, Pyla Durgarao and others., South : Vacant site of Maroju Satyaprasad.,East : Wet land of Purruboyina Ramachandra Rao & West : Palakonda to Srikakulam R & B road.

BRANCH MANAGER
A.P.STATE FINANCIAL CORPORATION

బీసీ రుణ దరఖాస్తుల పరిశీలన

శ్రీకాకుళం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ రుణాలకు వచ్చిన దరఖాస్తులు ఎంపీడీవో బిశైలజ పర్యవేక్షణలో అధికారులు పరిశీలించారు. మొత్తం 834 దరఖాస్తులు గాను బుధవారం 464 దరఖాస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించారు. గురువారం మిగిలిన ధ్రువ పత్రాలు పరిశీలిస్తామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ వైవీ రమణ, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● గార, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందడానికి బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 756 మంది దరఖాస్తులు రాగా, 550 పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు, ఈవోపీఆర్డీ కూర్మారావు, ఏవో రము, బ్యాంకు అధికారులతో కలిసి దరఖాస్తులు పరిశీలించారు.

● ఎచ్చెర్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ యూనిట్ల మంజూరునకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవా రం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 117 యూనిట్లు కేటాయించగా, 902 మంది దర ఖాస్తు చేసుకున్నారు. ఇందులో 525 మంది ఇంట ర్వ్యూకు హాజరయ్యారు. ఎంపీడీవో మల్లేశ్వరరావు, ఏవో రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెనుకబడిన తరగతుల వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా అందించనున్న రుణాలకు సంబంధించిన ఇంటర్వ్యూకు 402మంది లబ్ధిదారులు హాజరైనట్టు ఎంపీడీవో రామరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం లబ్ధిదారుల ఎంపిక నిర్వహించారు.

నగర పరిధిలో నేడు

శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో గురువారం సబ్సిడీ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీ ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఉదయం 10 గంటలకు బ్యాంక్ వారు నిర్వహించే ఇంటర్వ్యూకు అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

మునిసిపాలిటీ పరిధిలో..

ఆమదాలవలస, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీసీ రుణాల లబ్ధిదారులకు గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో 10.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 396 మంది అభ్యర్థులకు ఈ నెల 3న పురపాలక సంఘ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పలాస, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక నర్సిపురం కాలనీ సమీపంలో లేఅవుట్ వద్ద బుధవారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ ఎస్‌ఐ నర్సింహమూర్తి తెలిపారు. డ్రోన్ సాయంలో పేకాట, మద్యం, సారా, గంజాయిపై నిఘా పెట్టా మని, అందులో భాగంగా పేకాట ఆడుతున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. నింది తుల నుంచి రూ.60,400 నగదు, మూడు మోటార్ వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అగ్నిప్రమాదంలో వెదురు పొదల దగ్ధం

పలాస, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో మల్లా కామేశ్వరరావుకు చెందిన రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం జరిగి సమీపంలో ఉన్న వెదురు పొదలు దగ్ధమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావి స్తున్నారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసు కువచ్చారు. అగ్నిప్రమాదం జరిగిన సమీపంలో ధాన్యం ఊక ఉండడం తో అవి కాలిపోకుండా నీరుజల్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

13 మందిపై బైండోవర్ కేసులు

పాతపట్నం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో 13 మంది బెల్లం వర్తకులపై బుధవారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. నవోదయం 2.0 లో భాగంగా సారా తయారీపై బి-కేటగిరిలో ఉన్న బొన్ని కోణంగి, పూతికగూడ, చాప రాయిగూడ గ్రామాల సమీపంలో ఉండే పాతపట్నం, తెంబూరు, గంగువాడ గ్రామాలకు చెందిన 13 మంది బెల్లం వర్తకులకు తహసీల్దార్ కిరణ్ కుమార్ ఎదుట బుధవారం హాజరుపరిచారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన యువకులు

● నిందితుల్లో ఒకరు సంతబొమ్మాళి వాసి

డెంకాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదవలస జంక్షన్ చెక్‌పోస్టు శివార్లలో గంజాయి సేవిస్తున్న యువకులపై బుధవారం డెంకాడ ఎస్‌ఐ సన్యాసినాయుడు, సిబ్బంది దాడులు చేశారు. నలుగురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, మోటారు సైకిల్, 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు పట్టుబడిన వారిలో శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలానికి చెందిన ఎర్నాగుల గిరి బాబు, విశాఖపట్నం పెందుర్తి మండలానికి చెందిన బైలపూడి లక్ష్మీ నర సింహ నాయుడు, ఆనందపురం మండలం నీల కుండీలకు చెందిన షేక్ హబీబీ (అబి), అనకాపల్లి జిల్లా చీడికాడ మండలానికి చెందిన గంజి వెంక ట్రావు ఉన్నారని ఎస్‌ఐ సన్యాసినాయుడు తెలిపారు.

వనరులను పెంచి ఆదాయం రెట్టింపు చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీలు, క్రషర్లు, పాలిషింగ్ యూనిట్లలో వనరులు పెంచి అటు ప్రభుత్వానికి, ఇటు యాజమాన్యానికి ఆదాయం రెట్టింపు చేద్దామని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయా యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరిశ్రమల పరిస్థితి, లాభ, నష్టా లను అడిగి తెలుసుకున్నారు. పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధికి సహకరిం చాలని కోరారు. గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్ జిల్లా అధ్యక్షుడు సర్వ న్ మాట్లాడుతూ.. 2014-19 పరిస్థితులు నేడు కనిపించడం లేదని, చాలా పరిశ్రమలు ఎత్తివేసి ఒడిశా, తెలంగాణా ప్రాంతాలకు వెళ్లిపోతున్నాయన్నా రు. ప్రభుత్వం నుంచి కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లకు వచ్చే రాయితీ ఎత్తివేయడంతో పరిశ్రమ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. మైన్స్ ఏడీ విజయలక్ష్మి, ఏజీ రాము, ఆర్‌ఐ గణేష్, యాజమాన్య ప్రతినిధులు వెంక టాచలపతి, రౌతు రమేష్, చౌదరి సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన గుళికలతో రైతులకు మేలు

కొత్తూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విత్తన గుళికలు తయారు చేసుకో వడం వల్ల రైతులకు పంటల్లో మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం రేవతి అన్నారు. బుధవారం కొత్తూరులో విత్తన గుళికల తయారీపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుతున్న కాలా నికి అనుగుణంగా రైతులు పంటలు వేసేముందు దుక్కిలో విత్తన గుళికలు వేయటం వల్ల భూమిలో పంటలకు అనుకూలంగా ఉంటాయ న్నారు. యూనిట్ ఇన్‌చార్జి చిన్నమ్మి, ఐసీఆర్పీలు రవణమ్మ, భూదేవి, ఫార్మర్ సైంటిస్ట్ సుభాషిణి, రైతులు పాల్గొన్నారు.

ఏఐఆర్‌లో గిరిజనుల సంప్రదాయాలపై ప్రసంగాలు

పలాసరూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర గిరిజన తెగల ఆచార, సంప్రదాయాలపై ప్రతి బుధవారం ఆకాశవాణిలో ప్రసంగాలు ఉంటాయని గిడుగు రామమూర్తి కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు తెలిపారు. బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి గంట పాటు వీటిని ఏఐఆర్ ప్రసారం చేస్తుందన్నారు. మే 7వ తేదీ వరకు నాలుగు వారాల పాటు ఈ ప్రసంగాలు ప్రసారమవుతాయన్నారు. ఆకాశవాణి ప్రసార సమయంలో రేడియో, అనం తరం యాప్ ద్వారా వినవచ్చని ఆయన పేర్కొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వండి

పాతపట్నం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సాగు చేసి జీడి పంట వేసిన పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని పెద్ద లక్ష్మీపుం గ్రామ ఎస్సీ కుటుంబీ కులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. గ్రామానికి సమీపంలో టెక్కలి మండలం లింగాలవలస గ్రామ పంచాయతీ పరిధి కొండపై పట్టాలివ్వాలని కోరారు.

వరి, నువ్వు పంటల పరిశీలన

టెక్కలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీరంగం, తలగాం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఉదయబాబు, డాక్టర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయశాఖాధికారి కె.త్రినాథరావు ఆధ్వర్యంలో రబీలో పండించిన నువ్వు లు, వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో రంగారావు, సుమం త్, సోనీ, రైతు చాపర గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలి

పలాసరూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణతర్లా జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు జిల్లాస్థాయి ఈఎండీపీ పోటీ లలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఉపాధ్యా యుడు కొయ్యల శ్రీనివాసరావు పర్యవేక్షణలో అన్వేషి తదితరులు ప్రాజెక్టు రూపొందించారు. ఆర్జేడీ కె.విజయ్ భాస్కర్, డీఈవో తిరుమల చైతన్య అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలన్నారు.

ఘనంగా సహస్ర కలశాభిషేకం

పలాస, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సీతారామాలయం 50 వార్షికో త్సవం, షిర్డీసాయి ధ్యానమందిరం 25వ వార్షికోత్సవం సందర్భంగా బుధ వారం సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రాల నడుమ సీతారామ స్వామి, షిర్డీసాయి విగ్రహాలకు అభిషేకాలు చేశారు. ఈనెల 6న సీతారామ కల్యాణం నిర్వహించనున్నారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

నరసన్నపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్ టెక్నాలజీ కేంద్రంలో బుధవారం జే ఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్ విభాగంలో ఈ పరీక్ష నిర్వహించారు. ఈనెల 8 వరకు రెండు పూ టలా పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో రెండో విడతలో సుమారు 7 వేల మంది అభ్యర్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షలు రాస్తున్నారు.

దొయిసాగరం చెరువు అభివృద్ధి చేయండి

● ఎమ్మెల్యే శిరీషకు అంబుసోలి నేతల వినతి



ఎమ్మెల్యే గౌతు శిరీషకు సమస్యలను విన్నవిస్తున్న నేతలు

పలాస, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అంబుసోలి గ్రామానికి ఆనుకొని ఉన్న దొయిసాగరం చెరువులో ఆక్రమణలు తొలగించి చెరువును అభివృద్ధి చేయా లని టీడీపీ నేత ఎ.రామకృష్ణ తదితరులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి వినతిపత్రం అందించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాల యంలో ప్రజాసమస్యల పరిష్కారవేదికను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. హౌసింగ్, విద్యుత్ సమస్యలు, రోడ్లు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ఎక్కు వగా వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్య లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసు కున్నామన్నారు. టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్య నారాయణ, టంకాల రవిశంకర్ గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల బలోపేతమే లక్ష్యం

పాతపట్నం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల బలో పేతమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్రలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలను బుధ వారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశా లలో మౌలిక సౌక ర్యాల ఏర్పాటు, మధ్యాహ్న భోజనం, పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫారాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు చిత్తశుద్ధితో బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మంగపతి, నాయకులు పైలబాబ్జీ, డా.ఎస్.శరత్ పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలే బలం: ఎంజీఆర్

పాతపట్నం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు 'కార్యకర్తే అధినేత' కార్యక్రమం బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనంతగా సంస్థాగత నిర్మాణం ఒక్క టీడీపీకే ఉందన్నారు. ఈ సందర్భంగా కార్య కర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే బగ్గు రమ ణమూర్తి అన్నారు. బుధవారం ఆయన మబగాంలో శంకుస్థాపన చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో వీటి నిర్మానం చేపడుతున్నామన్నారు. మండలంలో సుమారు 55 వేల టీడీపీ సభ్యత్వాలు నమోదయ్యాయని, దీనికి సహకరించిన కార్యకర్తలు, నేతలను ఎమ్మెల్యే అభినందించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి సోమవారం కత్తెరవానిపేట క్యాంప్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు లిఖితపూర్వకంగా తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత బగ్గు అర్చన, ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, ఈవోపీఆర్డీ బి.పద్మావతి, ఎస్సార్పీ దంతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీయడం తగదు

● దోషులను వారంలోగా శిక్షించాలి



ఎస్‌ఐ అశోక్‌బాబుతో మాట్లాడుతున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

జలుమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలపై అన్యమత ప్రచార రాతలు రాసి హిందువుల మనోభావాలు దెబ్బతీయడం తగదని, దోషులను వారం రోజుల్లోగా శిక్షించాలని లేకుంటే రాష్ట్ర స్థాయి ఉద్యమం చేపడతామని వి శ్వహిందూ పరిషత్ ప్రతినిధులు హెచ్చ రించారు. ఈ మేరకు ఎస్‌ఐ అశోక్ బాబుకు బుధవారం వినతిపత్రం అందిం చారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ ప్రతినిధులు మాట్లా డుతూ.. మతాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరించిన వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని కోరారు. ప్రభుత్వం, చట్టాలపై మాకు నమ్మకం ఉందని, నింది తులను చట్ట ప్రకారం శిక్షించాలన్నారు. యలమంచిలి లో సమావేశం నిర్వహించి హిందువుల సంప్ర దాయా లు, ఔన్నత్యాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింహాద్రి పల్లుణరావు, జిల్లా అధ్యక్షుడు లోకనాథం ఆనందరావు, జిల్లా ఉపా ధ్యక్షుడు గొద్దు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇతర మతాల ప్రచారాలొద్దు

హరిపురం ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పవిత్ర స్థలాలుగా భావిస్తున్న దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద అన్యమత ప్రచార రాతలు రాయవద్దని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. మం దస పోలీసు స్టేషన్ ఆవరణలో సచివాలయాల మహి ళా పోలీసులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇలాంటి దుశ్చర్యలు ఎక్కడ జరిగినా నిఘా పెట్టాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.

అన్యమత ప్రచారం చేసిన వారిని శిక్షించాలి

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల గోడలపై అన్యమత ప్రచారం రాతలు రాసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చల్లవానిపేట సర్పంచ్ పం చిరెడ్డి రామచంద్రరావు స్వగృహంలో బుధవారం విలే కరులతో మాట్లాడుతూ.. మతోన్మాద శక్తులను అదుపులో ఉంచేందుకు ప్రభుత్వం పని చేస్తుం దన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టి విద్వేషాలను రెచ్చగొట్టి మతాలను వేరుచేసేందుకు కొందరు మతోన్మాదులు చేసిన పనిగా భావిస్తున్నామన్నారు. అన్ని కులాలు, మతాల వారిని ప్రభుత్వం సమానం గా చూస్తుందన్నారు.

ఇప్పటికే పోలీసులు దోషులను పట్టుకు నేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తోందన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, సర్పంచ్ దుంగ స్వామిబాబు, గుండ రామకృష్ణ తదితరులు, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలకు శుక్ర వారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని టెక్కలి ఈఈ జి.శంకర రావు ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ పాతపట్నం లైన్‌లో చెట్ల కొమ్మలు తొల గింపు, లైన్ మెయిం టినెన్స్ చేపడుతున్నం దున ఉదయం 8 గంటల నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అవసరం మేరకు 'ఉపాధి' పనులు

నందిగాం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేతనదారులకు అవసరం మేరకు పనులు కల్పించాలని ఎంపీడీవో టి.రాజారావు, ఏపీ వో ఎం.నాగరాజు సూచించారు. బుధవా రం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి పంచాయతీలో పనుల సంఖ్య పెంచా లన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉద యం 6.30 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యా హ్నం 3 గంటల నుంచి పనులు చేపట్టాలని సూచించారు.

ఎంపీడీవోగా జయంతి ప్రసాద్



కోటబొమ్మాళి, ఏప్రిల్ 2 (ఆంధ్ర జ్యోతి): ఎంపీడీవోగా జయంతి ప్రసాద్ (ఎఫ్ఏసీ) బుధ వారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన కె.ఫణీంద్ర కుమార్ వ్యక్తిగత కారణాల వల్ల సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో సంతబొమ్మాళిలో పని చేస్తున్న జయంతి ప్రసాద్‌ను ఇక్కడ ఎంపీడీవోగా నియ మించారు. సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

జలుమూరు, ఏప్రిల్ 2: (ఆంధ్రజ్యోతి): కరకవలస ఫీల్డ్ అసిస్టెంట్ పేడాడ ఈశ్వర రావుపై 'ఉపాధి' ఏపీడీ పి.లోకేశ్ బుధవా రం గ్రామంలో విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడ్డాడని గ్రా మస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన వేతనదారులనుంచి వివరాలు సేకరించా రు. నివేదికను జిల్లా అధికారులకు అందిం చనున్నట్లు తెలిపారు. విచారణతో ఏపీవో కె.శేఖర్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు మార్కింగ్



కొలతలు వేస్తున్న అధికారులు

టెక్కలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): టెక్కలి-భగవాన్‌పురం రోడ్డు విస్తరణకు బుధ వారం పంచాయతీ, ఇంజనీరింగ్ అధికారు లు మార్కింగ్ చేశారు. అంబేడ్కర్ కూడలి నుంచి తొలుసూరుపల్లి వరకు 40 అడు గుల రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు. ఈ మేరకు రోడ్డుకు ఇరువైపులా కొలతలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం లో నివాసం ఉంటున్న వారు ఆందోళనకు గురయ్యారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

నరసన్నపేట,ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వసంతోత్సవాల్లో భాగంగా బుధ వారం దూకలపాడులో జ్యోతి రామలింగేశ్వర స్వామి ఆలయం, కొత్తబస్టాం డ్‌లోని శ్రీరామమందిరంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిం చారు. ఆయా గ్రామస్థులు పెద్ద ఎత్తున కల్యాణంలో పాల్గొని తిలకించారు.

రావిచెంద్రిలో..



పందిరిరాట వేస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రావిచెంద్రి గ్రామంలో భువనేశ్వరి సహిత పరమేశ్వరుల కల్యాణోత్సవం పురోహితుడు బంకుపల్లి. మధుబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గాలాల వెంకట చిన్నప్పలనాయుడు దంపతులు ఆలయం వద్ద పందిరిరాట వేశారు. అనం తరం శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణోత్సవం చేపట్టారు. మధ్యాహ్నం భక్తు లకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పలువురు గ్రామస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

కోటబొమ్మాళి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చీపుర్లపాడు పంచాయతీ ఊడికల పాడు గ్రామంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు శ్రీరామనవమి ఉత్స వాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త సనపల కరుణ్ కుమార్ తెలిపారు. తొలి రోజు ఉదయం స్వామి వారి తీరువీధి, గాయత్రీ మహాయజ్ఞం చేపడుతున్నా మన్నారు. శనివారం మహిళతో సామూహిక కుంకుమ పూజలు, ఆదివారం ఉదయం 9 గంటల నుంచి వేదపండితులు సుసరాపు చంద్రశేఖరశర్మ ఆధ్వ ర్యంలో సీతారామ కల్యాణాన్ని 15 మంది దంపతులతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తరించాలని కోరారు.

మడపాం ఆధ్యాత్మిక కేంద్రంలో..

నరసన్నపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మడపాం అభయాంజనేయ స్వా మి ఆధ్యాత్మిక కేంద్రంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు తీర్మానించారు. ఈ మేరకు బుధవారం రామభక్త హనుమాన్ సే వా సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అభయాంజనేయస్వామి మందిర వార్షికోత్సవం, శ్రీరామ నవరాత్రి ఉత్సవాల నిర్వ హణపై చర్చించా రు. కొత్తకార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, బాడాన రాజశేఖర్, అధ్యక్షుడిగా తంగుడు జో గారావు, కార్యదర్శిగా పొట్నూరు నీలంలను ఎన్నుకున్నారు.

ఆటిజంపై అవగాహన ర్యాలీ

సంతబొమ్మాళి/కోటబొమ్మాళి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా సంతబొమ్మాళి, కోటబొమ్మాళిల్లో భవిత కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటిజం వచ్చేందుకు కారణాలు, నివారణ మార్గాలను వక్తలు వివరించారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు జె.చిన్నబాబు, అర్జునుడు, ఎల్వీ ప్రతాప్, హెచ్ ఎంలు కామరాజు, దుర్గాప్రసాద్, భవిత కేంద్రాల సిబ్బంది దేవమణి, శరత్ చంద్ర, ఫిజియోథెరపిస్ట్ జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్ పొందండి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

జలుమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికా బద్ధంగా చదువుకుని ఉజ్వల భవిష్యత్ పొందాలని ఎంఈవో బి.మాధవరావు అన్నారు. లింగాలవల స జడ్పీ ఉన్నత పాఠ శాలలో బుధవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వ హించారు. గురువులను గౌరవించి క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదువు కోవాలన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. హెచ్‌ఎం ఉంగటి అప్పలసూర్యనారాయణ, సర్పంచ్ దుంగ స్వామిబాబు, చిన్నదూగాం, నారాయణవలస హెచ్‌ఎంలు శోభన్ బాబు, పాగోటి జానకి తదితరులు పాల్గొన్నారు.

మందస కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హరిపురం ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మందస కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజన సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మందసలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మందసలో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్, ఇంజనీరింగ్ ఉప కార్యా లయాలున్నాయని, అందువల్ల వీటిని ఐటీడీఏ కార్యాలయంగా మార్పు చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని అమలు చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని కోరారు. అమా యకులైన ఆదివాసీలపైమద్యం వ్యాపారులతో కలిసి ఎక్సైజ్ అధికారులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని, దీనిని పునరాలోచించి విద్యార్థులు, మహిళలు, గర్భిణులు, బాలింత లపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ హైమవతికి వినతిపత్రం అందిం చారు. కార్యక్రమంలో సీపీఐ నాయ కుడు చాపర సుందర్‌లాల్, గిరిజన సంఘ నాయ కులు సవర రమేష్, జునాస్, కురా మణి, మాజీ సర్పంచ్ సవర సాంబే రమ్య, నీల కంఠం, భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ భాగస్వామ్యం కావాలి



జెండా ఊపి పోటీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

పలాస, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ భాగ స్వామ్యం కావాలని ప్రభుత్వ జూనియర్ కళా శాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి కోరారు. క్రీడా దినోత్సవం సందర్భంగా కళాశాల మైదానం లో విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వ హించి బహుమతులు అందించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ... క్రీడలతో మానసికో ల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొం దించుకోవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని, ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తున్నాయ న్నారు. పరుగు పందెం, షాట్‌పుట్, వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమం లో పీడీ మధు, వైస్ ప్రిన్సిపాల్ గణపతి తది తరులు పాల్గొన్నారు.

రెల్లి ఉప కులాలకు న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న రెల్లి ఉపకులాల నాయకులు

నరసన్నపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రెల్లి ఉప కులాలకు రిజర్వేషన్లలో న్యాయం జరి గేంత వరకూ పోరాటం చేయా లని ఆ సంఘ నాయకులు బెవ ర రాము, బూరెల శంకరరావు అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వాలు చేపట్టిన ఎస్సీ వర్గీకరణకు వ్యతి రేకంగా నినాదాలు చేశారు. సాంఘికంగా వెనుకబడి ఉన్న రెల్లి, ఉపకులాలను ఆదుకో వాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ నేతలు డేవిడ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకత్వం దేశాన్ని మారుస్తుంది

● ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు
● సెంచూరియన్ వర్సిటీలో జాతీయ మహిళా విద్యార్థి పార్లమెంట్



మహిళా విద్యార్థి పార్లమెంట్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ హరిబాబు

పర్లాకిమిడి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దేశ నాయకత్వాన్ని మార్చే శక్తి విద్యార్థులకు ఉందని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏఐయూ జాతీయ మహిళా విద్యార్థి పార్లమెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో తక్కువ శాతం ఉన్న మహిళా విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 50 శాతానికి పెరిగిందన్నారు. విద్యార్థుల నాయకత్వం దేశాన్ని మారుస్తుంద నేది గతంలో రుజువైందన్నారు. దేశ నాయకత్వంపై విద్యార్థి నులు ప్రత్యేక దృష్టి సారించి ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోవాలన్నారు. ఏఐయూ కన్వీనర్, ప్రొఫెసర్ సంగ్రామ్‌కేసరి స్వాయ్ స్వాగతం పలుకగా సెంచ్యూరియన్ ఉపకులపతి డాక్టర్ సుప్రి యా పట్నాయక్ మహిళలు సాధించాల్సిన లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమానికి 30 విశ్వ విద్యాలయాల నుంచి సుమారు 200 మంది విద్యార్థినులు హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ అనితా పాత్రో, డాక్టర్ ముక్తికాంతమిశ్రా, ప్రొఫెసర్ డీఎన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనం తరం సామాజిక- రాజకీయ అంశాలపై చర్చలు జరిగాయి. మూడు రోజు ల పాటు వివిధ అంశాలపై చర్చలు, వాదనలు జరగనున్నాయి.